57

# సర్కస్

మాస్టరుగారు క్లాసులోకి ప్రవేశించేసరికి పిల్లలు నానా రణగొణ ధ్వని చేస్తున్నారు.

ఆయన "సైలెన్స్..!" అంటూనే క్లాసులోకి ప్రవేశించారు.

పిల్లలు గోల ఆపి, "నమస్కారం..." అంటూ లేచి నిల్చున్నారు.

మాస్టరుగారు- "కూర్చోండి!" అంటూ తానూ కూర్చున్నారు.

ఆయన కూర్చున్నాక పిల్లలుకూడా కూర్చున్నారు.

క్లాసులో ఇంచుమించు నిశ్శబ్దం ఏర్పడింది. కాని, వెనక బెంచీల వైపునుంచి మాటలు వినిపిస్తున్నాయి.

మాస్టరుగారు తలెత్తి చూసి, "ఎవర్రా అది?!" అని గదిమారు.

ఎవరూ మాట్లాడలేదు.

"ఎవర్రా అది... మాట్లాడరేం?" అని మళ్ళీ గదిమారు మాస్టారు.

"చందూ, నందూ ఏమిటో మాటలాడుకుంటున్నారు సార్!" అని వెనక నుంచి ఎవరో జవాబు చెప్పారు.

"ఒరేయ్ చందూ, నందూ... నుంచోండిరా!" అన్నాడు మాస్టారు.

ఇద్దరూ నుంచున్నారు.

"ఏమిట్రా మీరు మాట్లాడుకుంటున్నదీ?" అని అడిగారు మాస్టారు.

"నిన్న రాత్రి మేము సర్కస్ చూశాం సార్. ఆ విషయాలు ఏవో మాటాడు కుంటున్నాం" అన్నాడు చందు.

"సర్కస్ చూసిన వాళ్ళైనా ఇలా క్లాసులో మాట్లాడవలసింది?" అన్నారు మాస్టారు.

ఆయన ఉద్దేశం అర్థంకాక, తలెత్తి ఆయనవంకే చూస్తూ వుండిపోయారు, అందరూనూ.



"ఊ... ఒరేయ్ చందూ... నువ్వు సర్కస్‌లో ఏమి చూశావురా?" అని అడిగారు మాస్టారు.

"అందులోని వారు ఎన్నో విచిత్ర ఫీట్లు చేశారు సార్. పైగా... విసుగు కలగకుండా వెంటవెంటనే చేశారు. నాకు సర్కస్ ఎంతో బాగుంది" అన్నాడు చందూ.

"ఒరేయ్ నందూ... నువ్వేమి చూశావురా?" అని అడిగారు మాస్టారు.

"నాకు జంతువులు చేసిన పనులు చాలా బాగున్నాయి సార్!" అన్నాడు నందూ.

"ఒరేయ్... సర్కస్ అంత బాగా వుండడానికి కారణం తెలుసా?" అడిగారు మాస్టారు.

ఎవరూ ఏమీ మాట్లాడలేదు.

"సర్కస్ రక్తి కట్టడానికి కారణం- దానిని ప్రదర్శించే వారిలో వున్న క్రమశిక్షణ! ఒక ఫీట్ అయిపోగానే బల్లలు తీసేవాళ్ళు తీస్తారు, వేసేవాళ్ళు వేస్తారు. వలలు కట్టేవాళ్ళు కడ్తారు, బోను పెట్టేవాళ్ళు పెడ్తారు. ఇవన్నీ ఒక క్రమంలో చకచకా ఎవరి పనులు వారు చేసుకుపోవడం వల్ల నిమిషాల మీద అయిపోతాయి. అందుకే విసుగు అనిపించదు. అంటే... సర్కస్ రక్తి కట్టడానికి కారణం- ముఖ్యంగా అందరూ కలసి ఎవరి పనులు వారు చేయడం! ఇందుకు ఎంతో క్రమశిక్షణ అవసరం. ఇది ఉంటుంది కనుకనే సర్కస్ బాగుంటుంది" అన్నారు మాస్టారు.

"మీరు చెప్పింది మేము చూసినా, మేము గ్రహించలేదు సార్!" అన్నాడు చందు.

"ఒక్క సర్కసే కాదు, మనం చూసే ప్రతి విషయంలోనూ ఎన్నో మంచి విషయాలు ఉంటాయి. వాటిని చూసి మనం ఎన్నో నేర్చుకోవాలి. సర్కస్‌లో మీరు క్రమశిక్షణ చూశారు గదా... మీరు కూడా క్రమశిక్షణ పాటించాలి. క్లాసురూంలో నిశ్శబ్దంగా వుండి, శ్రద్ధగా పాఠాలు నేర్చుకోవాలి" అన్నారు మాస్టారు.

"ఇక ముందు తప్పక అలాగే చేస్తాం సార్!" అన్నారు పిల్లలు.

★★★

